

రాష్ట్ర గవర్నర్‌కు ఘనస్వాగతం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి తిరుపతి జిల్లాకలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఘన స్వాగతం పలికారు. తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన విచ్చేశారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో తిరుపతి, శ్రీపద్మావతి అతిథి గృహానికి చేరుకున్నారు. గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి ఆర్‌డిఒ భానుప్రకాష్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ప్రకటన పై...

టిడిపి క్యాడర్‌లో అసంతృప్తి..!

- తిరుపతి నుంచి పనబాక లక్ష్మి
- చిత్తూరు నుంచి షణ్ముగం



పనబాక లక్ష్మి



షణ్ముగం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు, తిరుపతి జిల్లాలో టిడిపి అధ్యక్షుల పేర్లు ప్రకటించడంలో అధినేత చంద్రబాబు నాయుడుపై టిడిపి క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ప్రకటించిన కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా ప్రకటించిన షణ్ముగం క్యాడర్‌ని కలుపుకొని పోయే పరిస్థితి భవిష్యత్తులో ఉండదని తేల్చి చెప్తున్నారు కొందరు సీనియర్ నాయకులు. ఇంతమాత్రానికి అధిష్టానం సర్వేలు నిర్వహించి.. ఆలోచించి.. ప్రకటించిన పేర్లుపై కార్యకర్తలు కారాలు మిరియాలు నూరుతున్నారు.. వీరి నాయకత్వంలో పార్టీ దిగజారుడే తప్ప అభివృద్ధి ఉండదని బాహాటంగానే విమర్శిస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా తాము సూచించిన వ్యక్తులకు పార్టీ అధ్యక్షులు రాకపోవడంతో లోలోనే నిరసన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాల అధ్యక్షులు నరసింహ యాదవ్, సిఆర్ రాజన్ పదవీకాలం ముగియడంతో వారికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు కట్టబెట్టి అధిష్టానం సంతృప్తిపరిచింది. రెండు జిల్లాలు 6 మంది మంత్రులతో కూడిన బృందం పార్టీ అధ్యక్షులు పైన సమావేశం నిర్వహించింది. పార్టీ జిల్లా మహాసభలు కూడా జరుపుకున్నారు. అయితే ఇరు జిల్లాల్లో చాలా కొత్త అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ రావడంతో అధ్యక్షులను నియమించే బాధ్యతను అధినేత నారా చంద్రబాబు నాయుడుకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐవిఆర్ సర్వే నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి అధ్యక్ష పదవికి తెలుగు యువత రాష్ట్ర నాయకులు శ్రీధర్ వర్మ, మాజీ అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నెలవల సుబ్రహ్మణ్యం, పరసా రత్నం, శ్రీకాళహస్తి చెందిన టిడిపి నాయకులు గురవారెడ్డి, సూళ్లూరుపేట చెందిన సతీష్ రెడ్డిలు పోటీలో ఉన్నారు. పోటాపోటీగా పైరవీలు జరిగినప్పటికీ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబు, లోకేష్‌లు స్థానిక నాయకులు నేరుగా చెప్పారు. అంటే పరోక్షంగా శ్రీధర్ వర్మకు ఇవ్వాలని పట్టుబట్టారు. అలాగే చిత్తూరులో మాజీ అధ్యక్షులు సిఆర్ రాజన్, యువ నాయకులు సప్తగిరి ప్రసాద్, ఎంపీ ప్రసాద్ నాయుడు, జడ్పీ మాజీ చైర్మన్ గీర్వాణి భర్త ప్రకాష్ నాయుడు, సతీష్ నాయుడు మరో ఆరు మంది పోటీపడ్డారు. అయితే ఎవరికి పదవి దక్కలేదు. చిత్తూరులో యువత కన్వీనర్‌గా ఉన్న పుత్తూరుకు చెందిన షణ్ముగంకు చిత్తూరు జిల్లా అధ్యక్ష పదవి దక్కింది. ఇటు తిరుపతి అటు చిత్తూరు జిల్లాలో నాయకులు కార్యకర్తల్లో అధిష్టానం ప్రకటించిన అధ్యక్షులపైన బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా టిడిపి అధ్యక్ష పదవులను 26 జిల్లాల్లో రిజర్వేషన్ ప్రాతిపదికన పదవులు కట్టబెట్టినట్లు టిడిపి అధిష్టానం ప్రకటించినప్పటికీ టిడిపి క్యాడర్‌లో ఉత్సాహం అనేది కనిపించలేదు. చంద్రబాబు ప్రకటనపై తెలుగు తమ్ముళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లా టిడిపి అధ్యక్షులుగా ప్రస్తుత టిటిడి బోర్డు మెంబర్ పనబాక లక్ష్మిని ఎస్సీ రిజర్వ్ కింద ప్రకటించినట్లు అధిష్టానం వెలువరించింది. చిత్తూరులో షణ్ముగంను బీసీ రిజర్వేషన్ కింద ప్రకటించామని నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. టిటిడి బోర్డు మెంబర్‌గా ఉన్న పనబాక లక్ష్మి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండకూడదు. మరి ఆమె ఆ పదవికి రాజీనామా చేసి, పూర్తిస్థాయి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి జిల్లా అధ్యక్ష పదవి చేపడతారా అనేది తెలియాల్సి ఉంది.

పోక్సో కేసులో ర్యాపిడో ఆటో డ్రైవర్ అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పోక్సో కేసులో ర్యాపిడో ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అలిపిరి సీఐ రామ్ కిషోర్ తెలిపారు. నవంబర్ 3న ఓ హాస్టల్ నుండి మరొక హాస్టల్‌కు లగేజ్ తరలిస్తూ మైనర్ బాలికను ఆటో డ్రైవర్ పరిచయం చేసుకున్నాడు. మాయమాటలతో బాలికను నమ్మించి ధన సహాయం చేస్తాం టూ, ఈనెల 3న రూమ్‌కు తీసుకెళ్లి, బాలికపై అత్యాచారం చేశాడు. అత్యాచారానికి గురైన మైనర్ బాలిక తల్లిదండ్రులతో కలిసి ఈనెల 8న అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. క్రైమ్ నెంబర్ 448/2025 పోక్సో కేసు నమోదు చేసిన విషయం విదితమే. విచారణ చేపట్టిన పోలీసులు, నిందితుడు సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన ఆటో డ్రైవర్ సాయి కుమార్‌గా గుర్తించారు. నిందితుని మంగళవారం అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలిస్తున్నట్లు అలిపిరి సిఐ రామ్ కిషోర్ వెల్లడించారు.

రాహు-కేతు పూజల్లో రష్యన్ భక్తులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రష్యా దేశానికి చెందిన 29 మంది భక్తుల బృందం మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసింది. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రూ. 500 టిక్కెట్టుపై రాహు-కేతు పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుచున్నారు.

ఉపాధి హామీ

వేతనాల చెల్లింపులో జాప్యం ఎందుకు? : ఎంపీ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాలపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. కూలీల వేతనాల కోసం గ్రీన్ చానల్ లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా కూలీల ఖాతాల్లో వేతనాలు జమ చేసే విధానాన్ని తీసుకురావాలని కోరారు. గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాశ్వాన్ సమాధానమిస్తూ, రాష్ట్ర స్థాయి పరిపాలనా జాప్యాలతో, కూలీలు నష్టపోకుండా ఉండేందుకు జాతీయ ఎలక్ట్రానిక్ నిధుల నిర్వహణ వ్యవస్థ ఇప్పటికే సమర్థవంతంగా పనిచేస్తోందని, నిధులను వివిధ స్థాయిల్లో నిల్వ చేయకుండా నేరుగా కూలీలకు వేతనాలు చెల్లించడాన్ని ఈ వ్యవస్థ నిర్ధారిస్తోందని మంత్రి తెలిపారు.

ధరల సంక్షోభంపై ఎంపీ గురుమూర్తి అడ్జర్న్‌మెంట్ మోషన్

రైతులు ఎదుర్కొంటున్న ధరల సంక్షోభంపై ఎంపీ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ లేకపోవడంతో దేశవ్యాప్తంగా రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టాలలోకి నెట్టబడుతున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం, పంట ఉత్పత్తి ఖర్చు కంటే, కనీసం 50 శాతం అధికంగా కనీస మద్దతు ధర ఇవ్వాలన్న హామీ అమలుకాలేదని విమర్శించారు. సాగు ఖర్చులు పెరిగినప్పటికీ మద్దతు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మరోవైపు మధ్యవర్తుల దోపిడీ రైతులను మరింత ఇబ్బందికి గురుచేస్తోందని తెలిపారు. పత్తి, టమోటా, అరటి రైతులు మార్కెట్ ధరకు అమ్ముకోలేక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. వ్యవసాయం నిలదొక్కుకోలేని స్థితికి చేరుతోందని హెచ్చరించారు. కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

తిరుపతిని సుందరంగా తీర్చి దిద్దుతాం : తుడ చైర్మన్



తిరుపతి పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఐసిఎల్‌ఈఐ డైరెక్టర్ సౌమ్య చతుర్వేదుల, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఈమని కుమార్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిని సరస్సులు-చెరువుల నగరంగా అభివృద్ధి చేయాలనే ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి చొరవతో తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సమగ్ర ప్రణాళికను రూపొందిస్తోంది. ఈ మేరకు సాగునీటి శాఖ అధికారులతో పాటు అంతర్జాతీయ సంస్థల సహకారంతో డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయనుంది. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా చేసిన అభ్యర్థన మేరకు, ఐసిఎల్‌ఈఐ డైరెక్టర్ సౌమ్య చతుర్వేదుల, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఈమని కుమార్ మంగళవారం తుడాను సందర్శించారు. వారు పెరుమాళ్లపల్లి గ్రామాన్ని సందర్శించి, స్థానిక పంచాయతీ అధికారులు, గ్రామస్తులు, తుడా అధికారులతో కలిసి గ్రామాన్ని క్లైమేట్ స్మార్ట్ విలేజ్‌గా అభివృద్ధి చేసే అవకాశాలపై అధ్యయనం చేశారు. గ్రామంలోని డ్రైనేజ్ వ్యవస్థలు, ఎల్‌ఈడీ వీధి దీపాలు, సాలిడ్ వెస్ట్ ప్రాసెసింగ్ సెంటర్, మురుగునీటి ప్రవాహం-నిష్క్రమణ వ్యవస్థలను పరిశీలించారు. గ్రామ జనాభా ఆధారంగా కాన్సెప్ట్ నోట్ అందజేస్తామని ఐసిఎల్ ఈఐ ప్రతినిధులు తెలిపారు. అనంతరం వారు పేరూరు, అవిలాల చెరువులను సందర్శించారు. సాగునీటి శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర ప్రసాద్‌తో చెరువులకు సంబంధించిన సరఫరా కాలువలు, నీటి ప్రవాహ మార్గాలపై చర్చించారు. తుడా కార్యదర్శి డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్ బాబు మాట్లాడుతూ, మొదటి దశలో ఇరవై చెరువుల పునరుద్ధరణకు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిపుణుల సూచనలతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. నగర వరద నియంత్రణ, వాటర్‌షెడ్ అధ్యయనం, భూగర్భ జల పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, గాలి నాణ్యత నిర్వహణ, సౌరశక్తి వినియోగం, జీవ వైవిధ్య సూచిక వంటి అంశాల్లో నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నట్లు తుడా తెలిపింది. ఈ కార్యక్రమంలో తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్లు కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, డిఈ బాషా పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో పక్షుల పండగ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఫ్లెమింగో ఫెస్టివల్-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించాలని జిల్లా కల్లెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కల్లెక్టరేట్, మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఫ్లెమింగో ఫెస్టివల్-2026 నిర్వహణపై కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు పరిసర ప్రాంతాల్లో జనవరి10,11 తేదీల్లో రెండు రోజులు పాటు నిర్వహించబోయే ఫ్లేమింగో ఫెస్టివల్‌ను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఫెస్టివల్‌కు సంబంధించిన మైక్రో ప్లాన్ సిద్ధం చేయడం, తేదీలు ఖరారు చేయడం, కార్యక్రమాలు, పర్యాటక సదుపాయాలు, వేదికల ప్రణాళిక, పులికాట్ -నేలపట్టు, బివి పాల్యం, అటకానితిప్ప, ఇరక్కం ఐలాండ్, ఉబ్బలమడుగు, పెరియపాల్యం తదితర ప్రాంతాలల్లో ఏర్పాట్లు చేయుటపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖలు ప్రణాళికలను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. అలాగే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వీటికి సంబంధించి పోస్టర్, లోగో, పబ్లిసిటీ, బ్యానర్లు, డిజిటల్ బోర్డు ద్వారా విస్తృత ప్రచారం చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి ఎం.జనార్ధన్ రెడ్డి, ఏపీటీడీసీ ఈఈ సుబ్రమణ్యం, పర్యాటక శాఖ సిబ్బంది, ఈవెంట్ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్

- ముంబైలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయం నిర్మాణం
- తిరుమలలోని రహదారులకు శ్రీవారి నామాలతో పేర్లు
- టీటీడీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం : టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు



ధర్మకర్తల మండలి సమావేశంలో టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు

ప్రజాశక్తి - తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిటిడి ఆలయాలకు ధ్వజస్తంభం, రథాలు తయారు చేసేందుకు పలమనేరులో 100 ఎకరాలలో దివ్య వృక్షాలు పెంచాలని నిర్ణయించారు. తిరుపతి, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు అదనంగా రూ.48 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపారు. టీటీడీ బోర్డు విద్యాశాఖ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా టీటీడీలోని 31 విద్యా సంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లు, అవసరమైన సిబ్బంది, తదితర సౌకర్యాలను కల్పించేందుకు ఆమోదం తెలిపారు. ముంబై, బాంద్రా ప్రాంతంలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయం నిర్మాణాన్ని ఆమోదించారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో 20 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ప్లానింగ్, ఆర్కిటిక్ నియామకానికి ఆమోదం తెలిపారు. దాతల కాటేజీల నిర్వహణ, నిర్మాణాలపై నూతన సమగ్ర విధానం తీసుకురావాలని నిర్ణయించారు. తలకోన, శ్రీ సిద్దేశ్వర స్వామివారి ఆలయ పునః నిర్మాణ పనులలో భాగంగా రెండవ దశలో రూ.14.10 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపారు. తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 2100 హాస్టల్ సీట్లకు అదనంగా మరో 270 హాస్టల్ సీట్లు పెంచాలని నిర్ణయించారు. టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు కేటగిరిలలో ఖాళీగా ఉన్న 60 పోస్టుల భర్తీని ఆమోదించారు. తిరుపతిలో టీటీడీ నిర్వహిస్తున్న రోడ్ల నిర్వహణ, మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ కొనసాగించాలని నిర్ణయించారు. శ్రీవారి పోటులో నిబంధనల మేరకు నూతనంగా 18 పోటు సూపర్‌వైజర్ (పాచక) పోస్టులు ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు. తిరుమలలోని రహదారులు, ప్రధాన కూడళ్ళ పేర్లను వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలు, తదితర పేర్లతో మార్చేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శ్రీవారి ఆలయంలో ఒక ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టుల ఏర్పాటు, నిబంధనల ప్రకారం భర్తీకి ఆమోదం తెలిపారు. తిరుమల, కాలిబాటలో పురాతన ప్రాశస్త్యం ఉన్న నిర్మాణాల పరిరక్షణ కొరకు ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేసి, అనుభవం గల అధికారుల నియమకానికి ఆమోదం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలులో ఉన్న మధ్యాహ్న భోజన పథకం తరహాలో టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో డేస్కాలర్‌లకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించారు. టీటీడీ అనుబంధ ఆలయాలలో పని చేస్తున్న 62 మంది అర్చక, పరిచారక, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్లకు వేతనాలు పెంచాలని నిర్ణయించారు. అర్చకులకు రూ.25,000 నుండి 45,000, పరిచారకులకు రూ.23,140 నుండి 30,000, పోటువర్కర్లకు రూ.24,279 నుండి 30,000, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్లకు రూ.23,640 నుండి 30,000 పెంపును ఆమోదించారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు.

టిటిడికి రూ.60లక్షలు విరాళం



డీడీలను టిటిడి చైర్మన్ సమక్షంలో అందిస్తున్న దాతలు

శ్రీటీడీ వివిధ ట్రస్ట్‌లకు రూ.60లక్షలు విరాళం అందింది. సోమవారం తిరుమలలోని టిటిడి క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్. నాయుడును దాతలు కలిసి విరాళాల డిడిలను అందజేశారు. ఈ మేరకె ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కు బెంగుళూరుకు చెందిన దాతలు నయన, వి.ప్రభా, ఎస్.రాజేష్, కె.ఎన్.సందీప్ కుమార్, గుంటూరుకి చెందిన దేవరశేట్టి రితిష్, దేవరశెట్టి సత్యానారాయణ రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.60లక్షలు విరాళాలను డిడిల రూపంలో అందజేశారు. దాతలను చైర్మన్ అభినందించారు.

ఏపీఆర్ సెట్ ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఏపీ-ఆర్ సెట్ ప్రవేశ పరీక్షలను గత నెల నవంబర్‌లో నిర్వహించారు. మొత్తం 65 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించగా, 5,164 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 2,859 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి తెలిపారు. ఫలితాలను ఆయన ఆన్‌లైన్ ద్వారా అధికారికంగా విడుదల చేశారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు సంబంధించిన మౌఖిక పరీక్ష వివరాలను త్వరలోనే ఉన్నత విద్యా మండలి అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఏపీ-ఆర్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్. ఉష, కో-కన్వీనర్ ప్రొఫెసర్ జాన్ సుష్మలు తెలిపారు.

జాతీయ అంధుల జూడో పోటీల్లో రాణించాలి



ప్రజాశక్తి- వెంకటగిరి: ఆంధ్రప్రదేశ్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో 19తేది నుండి 23 వరకు నిర్వహించనున్న 14వ అంధుల జాతీయ జూడో పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున 22 మంది ప్రతిభ కలిగిన కేటాకారులను పంపనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరు చూరి పెంచల నరసయ్య తెలిపారు. మంగళవారం వెంకటగిరిలో ఆయన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ గత ఏడాది నిర్వహించిన 13వ జాతీయ అంధుల జూడో ఛాంపియన్షిప్ పోటీ ల్లో రాష్ట్రం నుంచి 9 మంది క్రీడాకారులు పాల్గొని, 4 బ్రాంజ్ పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించి ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచారని తెలిపారు. ఈ ఏడాది 14వ జాతీయ పోటీ ల్లోనూ ఏపీ క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. పోటీలకు వెళ్లే క్రీడాకారులకు అవసరమైన యూనిఫామ్‌ను బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. రాజస్థాన్‌లో జరగనున్న ఈ పోటీల్లో పాల్గొనే అంధుల జూడో క్రీడాకారులు విజయాలతో తిరిగి రావాలని పలువురు క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

సిఐటియు జెండా ఆవిష్కరణ



ప్రజాశక్తి - సత్యవేడు: విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి4 వరకు జరుగన్ను అఖిలభారత సిఐటియు, మహాసభల సందర్భంగా రాష్ట్ర కమిటీ రాష్ట్రమంతటా సిఐటియు కార్మిక జెండాలు ఎగరవేయాలని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా సత్యవేడు మండలం, మదనంబేడులో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం మదనంబేడు గ్రామ అధ్యక్షులు యేసయ్య సీఐటీయూ జెండా ఎగురవేశారు. అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పీఎం తిరుమలరెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ మహాసభల్లో ప్రధానంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి చేయాల్సి పోరాటాలపై దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు. కార్మికులందరూ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంబేద్కర్ బొమ్మను చెరిపేయండి.. అగౌరవపరచకండి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బొమ్మను చెరిపేయండి, అగౌరవపరచకండని రిపబ్లిక్ ఇన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి బైరాగి పట్టెడ ఎంజీఎం హైస్కూల్‌కు ఉత్త ర భాగంలో నిర్మించిన కాంపౌండ్ గోడకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, జాతీయ నాయకుల చిత్రాలను బొమ్మలను గీయించిన తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు వాటిని పట్టించుకోకపోవడంతో రోజుకు వందలాదిమంది మూత్ర విసర్జన చేస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు తీరని అవమానం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య పరిశీలన చేసి, అంబేద్కర్ బొమ్మకు అవమానం చేయడం కన్నా తొలగించడమే నయమని పేర్కొన్నారు. అలా జరగని పక్షంలో రిపబ్లికన్ పార్టీ పార్టీ ఆఫ్ ఇండియా కార్యకర్తలే స్వచ్ఛంధంగా ఎంజీఎం హైస్కూల్ కాంపౌండ్ గోడ మీద ఉన్న జాతీయ నాయకుల చిత్రాలను తొలగిస్తారని హెచ్చరించారు.

ఉపాధి హామీ చట్టం రద్దు దారుణం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దును పార్లమెంట్లో ఆమోదించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద రద్దు బిల్లును దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ నాడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ యూపీఏ ప్రభుత్వంలో వలస కూలీల నివారణ కొరకు జాతిపిత అయిన మహాత్మా గాంధీ పేరుతో గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం చేసి కూలీలకు సంవత్సరానికి 100 రోజులు కల్పించేందుకు బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీని ఒకవైపు పొగుడుతూ మరోవైపు ఆయన పేరుతో ఉన్న పథకాన్ని పూర్తిగా రద్దుచేసి మరో కొత్త పథకాన్ని తీసుకురావడం దారుణమన్నారు. కొత్తగా వచ్చిన పథకంలో పేరుకు 125 రోజులు పెంచినప్పటికీ రైతులకు వ్యవసాయ పనుల సీజన్లో 60 రోజుల పనిని నిషేధించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టంగా కాకుండా కేవలం కేంద్ర ప్రభుత్వం పథకంగా మార్చారని ఆరోపించారు. గతంలోఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు మంజూరు చేసి, రాష్ట్ర ప్రభుత్వం 10% జమ చేస్తాయని గుర్తు చేశారు. ప్రస్తుత నూతన చట్టం వల్ల 60 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విధంగా చూస్తే వ్యవసాయ కూలీలకు కడుపు కొట్టే పనిని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిందని దుయ్యబట్టారు. ఈ నూతన చట్టంపై రాష్ట్ర ప్రభుత్వాలు మరో చట్టం చేయాలని రాష్ట్రాలు ఆదేశించడం చూస్తే ఈ పథకం అమలు ప్రశ్నార్థకంగా భవిష్యత్తులో ఉంటుందని ఆందోళన వెలుబుచ్చారు. భవిష్యత్తులో ఈ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు కూడా ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాత పద్ధతిలోనే పథకాన్ని కొనసాగించి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 రూపాయల వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ముని శంకర్, రాజేష్, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, చిన్నబ్బ, నరసింహులు, రమేష్, ఆటో యూనియన్ నాయకులు విజయ్, దళిత గిరిజన సంఘం నాయకుడు నందయ్య తదితరులు పాల్గొన్నారు.



జీవోను దగ్ధం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘాలు నాయకులు

బిల్లు ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : ఉపాధి హామీ పథకం రద్దుపై నిరసన తెలుపుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ కూడలి వద్ద రద్దు బిల్లును దగ్ధం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ కేంద్రం తక్షణమే ఉపాధి హామీ పథకం రద్దు బిల్లు 197 ను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపాలు, రమణయ్య, కత్తి బాలాజీ, ఏసుదాసు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దూడల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



తాగు నీటి సమస్యకు పరిష్కారం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం, గోపాల కృష్ణాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి జడ్‌పి నిధులు మంజూరు చేయించారు. ఆయన ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో గోపాలకృష్ణాపురం పంచాయతీలో 5 లక్షల రూపాయలతో బోరు, మోటారు, పైపులైన్, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, మాజీ సర్పంచ్ హేమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



ప్రజాశక్తి - నాయుడుపేట: అమ్మ ఫౌండేషన్ రోటరీ క్లబ్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని నాయుడుపేట ఎంఈఓ-2 బి.మునిరత్నం పేర్కొన్నారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కృష్ణవేణి ఒక గుప్త దాత వద్ద సేకరించిన దుస్తులను, రోటరీ క్లబ్ వారు, ఎంఈఓ-1 మాధవితో కలిసి మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. నాయుడుపేట పట్టణం, ఎల్‌ఏ సాగరం వెస్ట్ కాంప్లెక్స్ పరిధిలోని 12 పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆదవరం నాగార్జున మాట్లాడుతూ పేద విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌గా ప్రభుత్వం ఇచ్చిన దుస్తులు కొంతకాలానికి చిరిగి పోతున్నాయని దృష్టిలో ఉంచుకొని ఈ దుస్తులు పంపిణీ చేశామని తెలిపారు. నాయుడుపేట ఎంఈఓ మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారు గతంలో ఇదేవిధంగా పేద విద్యార్థులకు బట్టలు ఇవ్వటం జరిగిందని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్, ట్రినిటీ హాస్పిటల్ అధినేత ఆదవరం నాగార్జున తమ అభ్యర్థన మేరకు నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని జువ్వలపాళెం గ్రామంలో ఒక పాఠశాలను దత్తత తీసుకొని సేవ దృక్పథంతో స్కూల్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వైద్య సేవలు అందిస్తూ మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారని, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు మీనా కుమారి, రోటరీ క్లబ్ కార్యదర్శి బట్ట సుబ్రహ్మణ్యం, రోటరీ సభ్యులు, చంద్రశేఖర్, ఎన్ రామ్మోహన్, ఇ.వి.ప్రసాద్, బల్లి కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వందే భారత్‌కు గూడూరు స్టాపింగ్ ఇవ్వాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: వందే భారత్ రైలుకు గూడూరులో స్టాపింగ్ ఇవ్వాలని మాజీ డిఆర్‌యుసిసి సభ్యులు మయూరి శ్యామ్ యాదవ్ కోరారు. ఆయన మాట్లాడుతూ గూడూరు రైల్వే జంక్షన్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, నిత్యం వేల మంది బెంగళూరు, చెన్నై, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. పలుమార్లు రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా ప్రయాణికుల సౌకర్యార్థం అధికారులు స్పందించి వందే భారత్ రైలుకు గూడూరులో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వెస్ట్ వరత్తూర్, మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10,000 విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, బిస్కెట్ దర్శన్ జ్యువెలరీ మమత జ్యువెలరీ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ జైన్ కుటుంబ సభ్యులు, మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు రవి కుమార్, లక్ష్మీ ఈశ్వరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి దాతలు సహాయం చేసినట్లయితే విద్యార్థులు ఎంతో గొప్పగా చదువుకుని ఉన్నత స్థాయికి వెళతారని ఆశాభావం వ్యక్తం చేశారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులు తర్వగా పూర్తి చేయండి



ప్రజాశక్తి - పిచ్చాటూరు : సత్యవేడు నియోజకవర్గంలో, దక్షిణలో ఉన్న రోడ్డు, మంజూరైన పంచాయతీ భవనాల పనులు త్వరితగతిన ప్రారంభించి, పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బి ఈఈ రాజా నాయక్, పంచాయతీ రాజ్ ఈఈ మధుసూదనలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ కార్యాలయాలకు ఎమ్మెల్యే వేర్వేరుగా వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగలాపురంలో రోడ్డు అధ్వాన్నంగా తయారయ్యిందని, వెంటనే సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేయించాలని కోరారు. కెవిబి పురం మండలంలోని సికె పురం కాజ్ వే ఇప్పటికే 5 సార్లు కొట్టుకు పోయిందని, ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. సత్యవేడు నియోజకవర్గంలో మంజూరైన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. తన వినతులకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు.

నేడు ప్రజాదర్బార్

మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని కూటమి నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని, ఇంటి పట్టాలు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ పథకాలు అందని వారు, సమస్యలను అర్జీ రూపంలో ఎమ్మెల్యేకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన గుడిమల్లం ఆలయ కమిటీ



ప్రజాశక్తి-ఏర్పేడు: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని గుడిమల్లం ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, కమిటీ మెంబర్ రాజా కుమార్‌లు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ యువనాయకులైన ఎమ్మెల్యే ఆలయ సాధన కోసం పని చేస్తామని, గుడిమల్లం ఆనందవల్లి శ్రీ పరమశుద్ధేశ్వరుని ఆలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని తెలియజేశారు.


నాయుడుపేటలో పెరిగిపోతున్న ఆకతాయిల అల్లర్లు

- అర్ధరాత్రి వరకు తాగుతూ అల్లర్లకు పాల్పడుతూ ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు
- తప్ప తాగి మహిళలను, పిల్లలను విచక్షణారహిత్యంగా కొట్టిన యువకులు

ప్రజాశక్తి - నాయుడుపేట: ఇళ్ల మధ్య నడిరోడ్డుపై కూర్చుని తాగుతూ, ఇష్టానుసారంగా అరుస్తూ దుర్భాషలాడుతూ గందరగోళం సృష్టిస్తున్న యువకులను ప్రశ్నించినందుకు ఒక వ్యక్తిని చితకబాది అడ్డు వచ్చిన వృద్ధులను, మహిళలను, పిల్లలను సైతం విచక్షణారహిత్యంగా కొట్టడమే కాక ఇళ్లల్లోకి దూరి దౌర్జన్యాలకు పాల్పడిన ఘటన నాయుడుపేట పట్టణంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీ అర కిలోమీటర్ పైన పొడవుగా 20 వీధులు కలిగిన ఆ కాలనీలో అన్ని కులాల వారు కలిసి దాదాపుగా 500 కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. అదే కాలనీలో నివసిస్తున్న కొందరు యువకులు ఆకతాయిలుగా తిరుగుతూ అల్లర్లు సృష్టించడమే పరిపాటిగా పెట్టుకుని అడ్డొచ్చిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతూ ఉంటారని స్థానికుల సమాచారం. ఏమాత్రం విలువలు పాటించని ఆ యువకులు ప్రతిరోజు చంద్రబాబు నాయుడు కాలనీలో వారు ఉంటున్న వీరికి దాదాపుగా పది వీధులు అవతలకు వచ్చి పిల్లలు మహిళలు తిరుగుతున్న దారిలో రోడ్డుపైనే కూర్చుని ఇష్టానుసారంగా తాగుతూ మహిళలు వినలేని రీతిలో మాట్లాడుకుంటూ అల్లర్లు సృష్టిస్తున్నారని కాలనీ వాసులు ఆరోపించారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా ఇలాగే తాగుతున్న సమయంలో.. ఆ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం కూలి పనులు ముగించుకుని ఇంటికి వెళుతూ వారి ఇంటి పక్కనే ఈ యువకులు చేస్తున్న అల్లరి భరించలేక ఇదేమిటి అని ప్రశ్నించగా అతన్ని మురళి, ఈశ్వర్ అనే వ్యక్తులు, మరో ముగ్గురు యువకులు.. మమ్మల్నే ప్రశ్నిస్తావా అంటూ ఇష్టం వచ్చినట్టు కొట్టి, వెంకటేశ్వర్లు భార్య, కూతుళ్లపై కూడా దాడి చేశారు. తనను చంపేం దుకు ప్రయత్నించారని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆపేం దుకు ప్రయత్నించగా విచక్షణ కోల్పోయి న ఆ యువకులు వారందరి పై రాళ్లతో, కర్రలతో దాడి చేసి మమ్మల్నే అడ్డుకు నేందుకు ప్రయత్ని స్తారా అంటూ వృద్ధులను, మహిళలను, పిల్లలను కొట్టారని మాన వత్వం మరిచిపోయి అక్కడ వారిని దుర్భాషలాడుతూ పెద్ద పెద్దగా అరుస్తూ బెదిరిస్తూ కాలనీ వాసులను భయభ్రాంతులకు గురిచేశారని అక్కడి మహిళలు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తొలిసారి కాదని గతంలో కూడా ఇలానే చేస్తే ఒకటి రెండు సార్లు కేసులు కూడా పెట్టామని పోలీసులు వాళ్లని పెద్దగా మందలించక పోవడంతో వాళ్ల దౌర్జన్యాలు మరింతగా పెరిగిపోయాయని సంఘటన జరిగిన తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాళ్లపై ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిన సమయంలో ఆ యువకులు మళ్లీ మా ఇళ్లపై పడి తలుపులు పగలగొట్టేందుకు ప్రయత్నిస్తూ ఇళ్లల్లోని ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడతామని బెదిరించారని, అక్కడి మహిళలు కన్నీరు పెట్టుకున్నారు. ఒక్క చంద్రబాబు నాయుడు కాలనీలోనే కాదు పట్టణంలో అనేక చోట్ల యువకుల దాష్టీకాలు పెరిగిపోతున్నాయి. వారికి సంబంధం లేని చోటుకు వెళ్లి అర్ధరాత్రి వరకు తాగుతూ చుట్టుపక్కల కుటుంబాలు ఉన్నాయని, ప్రజలు నివసిస్తున్నారన్న ఆలోచన కూడా లేకుండా పెద్ద పెద్దగా అరుస్తూ అల్లర్లకు పాల్పడుతున్నారు. వీరి కుటుంబ సభ్యులు వీరిని ప్రశ్నించకపోవడం ఎక్కడైనా గొడవలు జరిగితే కుటుంబ సభ్యులే వీళ్లకు ఆసరాగా నిలవడంతో ఇలాంటి వారి వికృత చేష్టలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఈ విషయంలో పోలీస్ శాఖ వారు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటివారిని ఇలాగే వదిలేస్తే వీరి దౌర్జన్యాలు ఎక్కడ వరకు వెళ్తాయో ఊహించడం కష్టం. ఇలాంటి ఆకతాయిల కారణంగా మరికొన్ని అఘాయిత్యాలు జరగకముందే వీరి ఆగడాలకు కళ్లెం వేయాలని ప్రజలు పోలీసులను అభ్యర్థిస్తున్నారు.



బాధిత కాలనీ వాసులు



గాయాల పాలైన వెంకటేశ్వర్లు

ఈ ఘటనపై నాయుడుపేట ఎస్సై ఆదిలక్ష్మిని వివరణ కోరగా..

ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కాలనీవాసులు బాధితులతో వచ్చి జరిగిన ఘటనపై సోమవారం రాత్రి ముగ్గురు యువకులపై ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ అల్లర్లకు పాల్పడ్డ ముగ్గురు యువకులని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు. ఇలాంటి ఘటనలపై ఇదివరకు మాకు ఎప్పుడు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జరిగిన ఘటనపై ఫిర్యాదు అందగానే వెంటనే స్పందించి యువకుల్ని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటినుంచి పట్టణంలో ఇలాంటి వారిపై నిఘా పెడుతున్నామని పట్టణంలో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో కానీ ఇళ్ల మధ్యలో గానీ మద్యం చేయించిన అల్లర్లకు పాల్పడిన ఉపేక్షించేది లేదని తెలియజేశారు. స్థానికులు కూడా ఇలాంటి వాటిపై స్పందించి మాకు సమాచారం అందిస్తే వెంటనే స్పందించి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెజ్లింగ్‌లో బాలికల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఒంగోలు జిల్లా, కొత్తపట్నంలో 13, 14 తేదీల్లో జరిగిన 3వ రాష్ట్ర స్థాయి బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో, పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు 14 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో12 మంది బాలికలు పతకాలు సాధించారని, పాఠశాల ప్రధానోపాధ్యాయిని భువనేశ్వరి తెలిపారు. 6 బంగారు పతకాలు సాధించినట్లు ఎపి బీచ్ గాల్ప్లింగ్ ప్రెసిడెంట్ రేఖారాణి, గోవిందమ్మలు తెలిపారు. విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలను పలువురు అభినందించారు.

ఘనంగా ప్రవీణ్ చౌదరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి టౌన్ టవర్ క్లాక్ వద్ద, చంద్రగిరి టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ప్రవీణ్ చౌదరి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కుమారుడు పులివర్తి వినీల్ హాజరయ్యారు.

పశువైద్య కళాశాల విద్యార్థిని పల్లవి ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయంలోని పశువైద్య కళాశాలలో బివిఎస్సి చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పల్లవి ఇటీవల విర్బాక్ ఫార్మా కంపెనీ వారు నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విర్బాక్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు కళాశాలకు విచ్చేసి ఆమెకు బహుమతిని, ప్రశంసా పత్రాన్ని అందించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య పల్లవిని అభినందించారు.

విత్తనాల పంపిణీ



ప్రజాశక్తి - చిట్టమూరు: మండల కేంద్రంలోని, చిట్టమూరు రైతు సేవ కేంద్రంలో మంగళవారం రైతులకు సబ్సిడీ విత్తనాల సరఫరా ప్రారంభమించారు. దిత్వా తుపాను కారణంగా ముంపుకు గురైన పొలాలను, సంబంధిత రైతులను గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి ఇచ్చిన రికార్డుల ప్రకారం ఆయా రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయుటకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం టీడీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి రైతుకు ఎకరాకు 25 కేజీల చొప్పున 80 శాతం సబ్సిడీతో ఒక బస్తా కి 200 రూపాయల చెల్లించే విధంగా విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాబు నాయుడు, రషీద్, వెంకటరమణ, మారం రెడ్డి జనార్దన్ రెడ్డి, పిట్టివానిపల్లి గ్రామ అధ్యక్షుడు పిట్టి రవి పాల్గొన్నారు.

ఎస్వీయూ ఆరోగ్య కేంద్రానికి పోర్టబుల్ ఇసిజి యంత్రం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, యస్వీయు ఉప కులపతి ఆచార్య టాటా నరసింగరావు క్యాంపస్‌లోని ఆరోగ్య సంరక్షణ కేంద్రం సేవలను బలోపేతం చేయడానికి తన వ్యక్తిగత సహకారంగా మంగళవారం హెల్త్ సెంటర్‌కు పోర్టబుల్ ఇసిజి యంత్రాన్ని విరాళంగా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బంది, క్యాంపస్ నివాసితులకు అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అందించడానికి ఈ యంత్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పదవుల కాంక్షతో పార్టీలు మారే వ్యక్తి చక్రపాణి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పదవుల కాంక్షతో పార్టీలు మారుతూ ఎదుగుదలకు కారణమైన వారిని దుర్భాషలాడే మనస్తత్వం ఉన్న వ్యక్తి మాజీ శ్రీశైలం బోర్డు చైర్మన్ చక్రపాణి రెడ్డి అని, మాజీ మంత్రి రోజా సిఫార్సుతో చైర్మన్ పదవి పొంది తిరిగి ఆమె సహకారం లేదని చెప్పడం దుర్మార్గమని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన నగిరి వైసీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. తన చిన్నాన్న మాజీ మంత్రి చెంగారెడ్డిని అడ్డుపెట్టుకొని కోట్లు వెనకేసిన చక్రపాణి రెడ్డి, ముద్దుకృష్ణమనాయుడు వద్ద ముడుపులు తీసుకొని ఆయన ఓటమికి పనిచేసింది వాస్తవం కాదాని ప్రశ్నించారు. నగిరిలో అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి రోజాపై నోరు పారేసుకోవడం పద్ధతి కాదన్నారు. చక్రపాణి రెడ్డి ఇన్ని కుట్రలు చేసిన పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి గుర్తించి ఆమెకు మంత్రి పదవి ఇచ్చారన్నారు. ఇకనైనా ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో నగరి మున్సిపల్ చైర్మన్ హరి, నీలమేగం, వైస్ చైర్మన్ జయప్రకాష్, మాజీ ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, సుబ్రహ్మణ్యం రెడ్డి ధర్మయ్య పాల్గొన్నారు.

ఎస్వీయూ ఫిజిక్స్‌విభాగంలో శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో ల్యాబ్ మెటీరియల్ నిర్వహణపై వారం రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం పలువురు నిపుణులు ల్యాబ్ పరికరాల నిర్వహణ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకించి మైక్రోస్కోప్, సెంటర్ ఫీజ్, ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపీ, వెస్టన్ బ్లాటిన్, స్పెక్, అనలిటికల్ అనాలసిస్, పి సి ఆర్, హెచ్ పి ఎల్ సీ, జిసిఎంఎస్ తదితర పరికరాలపై నిపుణులు సునీత బత్రా, మినరల్ తమన్కర్, సరిత తోప్టే, సుధీర్ కుమార్, గోవిందు చిట్టే, మైలైన్డ్ షిడ్రక్, స్వప్నిల్ జాదవ్ తదితరులు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రేణిగుంట పీహెచ్‌సీ తనిఖీ

ప్రజాశక్తి - రేణిగుంట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని బొజ్జల బృందమ్మ కోరారు. మంగళవారం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వైద్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ల్యాబ్, మెడిసిన్ స్టోర్, వ్యాక్సిన్ నిల్వ గది, లేబర్ రూం, వార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రోజూ వచ్చే రోగుల సంఖ్య, వారికి అందిస్తున్న చికిత్సలపై డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల అవసరమైన మందులు నిరంతరం అందుబాటులో ఉండాలని, ఆసుపత్రి ఆవరణను శుభ్రంగా ఉంచాలని ఆమె అధికారులకు సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, ముడియూరులో రిజర్వు బ్యాంకు వారి అనుబంధంతో విడ్స్ సంస్థ నిర్వహించు ఆర్థిక అక్షరాస్యతపై గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జానకిరామయ్య మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండడంతోపాటు, ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ వేసుకోవాలని సూచించారు.

అధికారుల పని తీరుపై మండిపడ్డ ఎంపీపీ



ప్రజాశక్తి - బాలాయపల్లి: స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సాదారణ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఈ క్రమంలో పశువైద్యశాఖ, ఎపిఎస్ఆర్టీసి శాఖ, గృహ నిర్మాణశాఖ, పోలీస్ శాఖ అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో ఆయా శాఖల అధికారులు ప్రజల సమస్యలపై చర్చిందేందుకు రాలేదంటే ప్రజల సమస్యల పట్ల వారి నిర్లక్ష్యం అర్థమవుతుందని మండిపడ్డారు. ఆర్ అండ్ బి ఎఈ బాబు మాట్లాడుతూ పెరిమిడి రోడ్డుకు రూ.1.60 కోట్లు, నిడిగల్లు రైల్వేస్టేషన్ సమీపంలోని కల్వర్టు నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు కాగా, పల్లిపాడు వద్ద కల్వర్టు నిర్మాణానికి రూ.23 లక్షలు, కయ్యూరు కల్వర్టుకు రూ.22 లక్షల వ్యయంతో ప్రతిపాదలు తయారు చేసి పంపించామన్నారు. బాలాయపల్లిలో మంచినీటి సరఫరాలో నీరు బురదనీరు వస్తున్నాయని వాటిని తాగి డయేరియా బారిన పడ్డారని, వాటర్ ట్యాంకులు, శుభ్రపరుస్తున్నారా అని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి ఆర్ డబ్ల్యూఎస్ ఎఈ ని ప్రశ్నించారు. దీంతో ఎఈ మాట్లాడుతూ చెరువులో నీరు పెరగడంతో బురదనీరు వస్తున్నాయని చెరువులో నీరు తగ్గాక బురదనీరు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిదంగా బాలాయపల్లిలో రోడ్డుపై నీటి నిల్వలు చేరి మురుగుమయంగా ఉందని వాటి వలన దోమలు ప్రభలే అవకాశం ఉందని, నీటి నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీఓ నారాయణ, ఉప ఎంపీపీలు బట్టేపాటి మురళిమోహన్రెడ్డి, వానా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. మంత్రి వీరాంజనేయ స్వామిని మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి తీర్థప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పలు ప్రతిపాదనలు బొజ్జల మంత్రి వద్ద ఉంచగా ఆయన సానుకూలంగా స్పందించారు.

నారాయణలో విజయ్ దివస్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం టెక్నో స్కూల్లో మంగళవారం విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా1971లో పాక్‌పై భారత్ సాధించిన చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకున్నారు. విద్యార్థుల చేత మిలటరీ దుస్తులు వేయించి పాక్‌పై విజయానికి చిహ్నంగా సంబరాలు చేసుకున్నారు. ఆనాటి విజయంతో బంగ్లాదేశ్‌కు స్వాతంత్రం వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగినేనికి శుభాకాంక్షలు వెల్లువ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడుకు మంగళవారం పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకాళహస్తి మండల విద్యుత్ శాఖ ఏడిఈ సుబ్రమణ్యం చెంచయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రైతు బిడ్డకు మరోసారి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అవకాశం కలగడం మంచి పరిణామమని ఏడిఈ హర్షం వ్యక్తం చేశారు. రైతాంగం అభివృద్ధికి విద్యుత్ శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

భూవివాదంలో 11మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండల పరిధిలోని యాచవరం గ్రామంలోని సర్వే నంబరు 96 లో గల 66 సెంట్ల భూమి విషయంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న భూ వివాదంలో 11 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. భూమికి హద్దులు చూపాలని కనుపూరు మారుతి రెవెన్యూ అధికారులకు సర్వే కొరకు అర్జీ పెట్టుకున్నారు. సర్వే నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు వెళ్లగా ఇరువర్గాలు వివాదానికి దిగారని, దీంతో రెవెన్యూ అదికారులు వెనుతిరిగారు. ఈ క్రమంలో కనుపూరు లక్ష్మి అనే మహిళతో పాటు మరో ముగ్గురు దాడి చేశారని కనుపూరు మారుతి పోలీసులకు పిర్యాదు చేయగా, కనుపూరు మారుతితో పాటు మరో ఆరుగురు కలసి తనపై దాడి చేశారని కనూపూరు లక్ష్మి పిర్యాదు చేశారు. ఈ మేరకు పదకొండు మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్వేరియం, రంగు చేపల పెంపకంపై శిక్షణ


ప్రజాశక్తి -దొరవారిసత్రం : రంగు చేపలతో, అక్వేరియం తయారీపై మంగళవారం మండల కేంద్రంలోని శ్రీశక్తి కార్యాలయంలో మత్స్యశాఖ, జిసిఎఫ్ శాఖ అధికారులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీషరీస్ ఏడి రాజేష్ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాలైన ప్రజలకు చేపల పెంపకం అనుకూలమన్నారు. వీటి ద్వారా వ్యాపారం చేయదలుచుకున్న వారు జిసిఎఫ్,సెర్ప్ సంస్థలు 100 శాతం నిధులు కల్పిస్తూ చేపల పెంపకం మెలుకువలు, అక్వేరియం తయారీ, మార్కెటింగ్ ఎలా చేయాలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. జిల్లా పరిధిలో కలెక్టర్ ఆమోదంతో, మత్స్యశాఖ ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు అయన పేర్కొన్నారు. యూనిట్‌కు 3 కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపాల్ రెడ్డి, ఎమ్పిటిసి, ఉదయకుమార్, ఎమ్పిడిఓ, గోవర్ధన్, కోఆర్డినేటర్ డాక్టర్ జస్వంత్, సందీప్, రఘురాం, ఏపీఎం మునిరాజా, జగపతిబాబు, సౌమ్యలత, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని కరకంబాడి, వేణుగోపాలపురం, పాంచాలి నగర్ ప్రాంతాల్లో టీడీపీ మండల నాయకులతో కలిసి బొజ్జల బృందమ్మ సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా చికిత్సకు అవసరమైన ఆర్థిక సాయం అందుతోందన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం న్యూస్

వైసిపి నాయకుడి వాహనం ధ్వంసం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చైతన్య కారును కొంతమంది ధ్వంసం చేశారు. బాధితుడు చైతన్య మాట్లాడుతూ తిరుపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భూమన అభినయ్ రెడ్డి ముఖ్య అనుచరుడుగా ఉన్నందుకే నాపై కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారని తెలిపారు. అక్కరాంపల్లి రాధాశ్యాం అపార్ట్ మెంట్‌లో అర్ధరాత్రి 2 గంటలు సమయంలో పార్క్ చేసి ఉన్న వాహనాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. సిసి కెమెరాల్లో సంబంధిత దృశ్యాలు రికార్డ్ అయ్యాయని తెలిపారు. ఈ మేరకు అలిపిరి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని, ఇప్పటికే రెండు సార్లు దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో మంగళంలో తన ఇంటి వద్ద, ఇప్పుడు నివాసం ఉంటున్న అపార్ట్మెంట్‌లో కారు ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటుగా రూ.6 లక్షల రూపాయల జరిమానా విధించినట్లు ఆర్ఎస్ఎస్ ఏడీజేకోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు వెలువరించారని టాస్క్ ఫోర్స్ వర్గాలు తెలిపాయి. తిరుపతి జిల్లా, నాగపట్ల బీట్ పరిధిలోని టిఎన్ పాలెం సెక్షన్ లో 2017 జూన్‌లో ఇద్దరూ తమిళనాడు రాష్ట్రం తిరువన్నమలై జిల్లాకు చెందిన ముద్దాయిలు విజయ్ కుమార్, మణిలను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. వీరిద్దరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారన్నారు. కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు సెంట్రల్ జైలుకు వీరిరువురిని అప్పగించడం జరిగిందన్నారు.

ఘనంగా సంగీత స్థాపన దినోత్సవం



ప్రజాశక్తి - రేణిగుంట: : మండల పరిధిలోని సిఆర్ఎస్ కేంద్రయ విద్యాలయంలో మంగళవారం సంగీత స్థాపన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ప్రమోద్ చైర్మన్ హాజరయ్యారు. ముందుగా విద్యాలయంలో నూతనంగా నిర్మించిన ఒకేషనల్ ల్యాబ్‌ని ప్రారంభిచారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో రాష్ట్ర స్థాయి వక్తృత్వం, శలాకా పోటీల ముగింపు కార్యక్రమం వాగ్వర్ధిని పరిషత్ ద్వారా డాక్టర్ చెలికాని అన్నారావు న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించారు. 2 రోజులలో మొత్తం 36 పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు, సర్టిఫికెట్లు, నగదు బహుమతులు ప్రదానం చేశారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో స్థానిక ప్రజలకు విలేజ్ హెల్త్ క్లినిక్, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించి, 30 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, 3 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ నిర్మాణాలకు రూ.7.246 కోట్లు మంజూరు చేశారు.

గిరిజనులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ధనుర్మాసం ఆరంభం సందర్భంగా గాంధీనగర్ గిరిజన కాలనీలో పేదలకు దుస్తులు, చీరలు 30 మందికి పంపిణీ చేశారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుపేదలను గుర్తించి, సహాయం చేసేందుకు ప్రగతి సేవా సంస్థ ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, విఎంసి మెంబర్ వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ దయాకర్, శ్రీనివాసులు, సతీష్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో పోటాపోటీగా స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-ఏర్పేడు: ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ తిరుపతి సంయుక్తంగా నిర్వహిస్తున్న 58వ ఇంటర్ ఐఐటీ స్పోర్ట్స్ మీట్ మూడవ రోజున చదరంగస్, టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రసవత్తరంగా జరిగాయి. 8 రోజుల వరకు జరిగే ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లతో ఐఐటీల నుంచి విద్యార్థులు అథ్లెట్లు వివిధ విభాగాల్లో విజయానికి పోటీ పడుతున్నారు. మూడవ రోజు అనేక ఈవెంట్లలో ఎడ్జ్-ఆఫ్-ది-సీట్ యాక్షన్ రెండు రౌండ్ల తర్వాత 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఐఐటీ ఖరగ్పూర్ 7.5 పాయింట్లతో వెనుకబడి ఉండగా, ఐఐటీ బీహెచ్యూ వారణాసి, ఐఐటీ హైదరాబాద్ 6 పాయింట్లతో మూడవ స్థానంలో ఉన్నాయి. టెన్నిస్ లీగ్ మ్యాచ్లు నాక్ అవుట్ దశకు ముందుకు సాగడానికి కీలక పాయింట్ల కోసం పోరాడుతున్నారు. వెయిట్లిఫ్టింగ్ ఐఐటి రూర్కీ, ఐఐటి కాన్పూర్, ఐఐటి కాన్పూర్, ఐఐటి బీహెచ్యూ వారణాసితో ఆధిపత్యం చెలాయించింది.

ఫెయిల్యూర్ బాయ్స్ సినిమాను ఆదరించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రేమలో విఫలమైన యువకులు జీవితంలో సక్సెస్‌కు దగ్గరైన సంఘటనలతో గురుదక్షిణామూర్తి పతాకంపై రూపొందించిన "ఫెయిల్యూర్ బాయ్స్" చిత్రాన్ని ప్రజలు ఆదరించాలని చిత్ర దర్శకులు శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. అపజయం నుండి విజయం వైపు ఎలా అడుగులు పడ్డాయో ఈ చిత్రంలో చక్కగా చూపినట్లు చిత్ర హీరో అవితేజ, కథానాయకి సుపూర్ణ మలకర్ తెలిపారు.